క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఖానాపురం : రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. జీలుగ విత్తనాల విక్రయాలను ఈనెల 7వ తేదీ వరకు పొడగించినట్లు చెప్పారు. మళ్లీ తేదీ పొడిగించే అవకాశం లేదని, కావాల్సిన రైతులు మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో తీసుకోవాలని సూచించారు. పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకెళ్లాలన్నారు.

అభినందనీయం



నల్లబెల్లి : గ్రామాభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావడం అభినందనీయమని రాంపూర్ సర్పంచ్ చింతపట్ల సురేష్ అన్నారు. రాంపూర్ గ్రామానికి చెందిన తూముల రామారావు జ్ఞాపకార్థం వారి కుమారులు సంపత్ రావు, వెంకటేశ్వర్లు గ్రామాభివృద్ధిలో భాగంగా వైకుంఠధామం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు సాయం చేశారు. ఈ చెక్కును సర్పంచ్‌కు శనివారం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములైన సంపత్‌రావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నిక



లక్ష్మీనారాయణ

నల్లబెల్లి : గౌతమి తాపీ సంఘం నల్లబెల్లి అధ్యక్షుడిగా సామల లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు క్యాతం మొగిలి ప్రకటనలో శనివారం తెలిపాడు. ఉపాధ్యక్షుడిగా చింత వెంకన్న, కార్యదర్శిగా ఆలేటి ఐలయ్య, కోశాధికారిగా కొండ్లె శ్రవణ్, సహాయ కోశాధికారిగా ఉడుత స్వామి, సభ్యులుగా బుట్టి శ్రీను, ఒడ్యాల కుమారస్వామి, గాజుల రాజేందర్, రాచర్ల శ్రీను, మద్దెబోయిన రాజు, చిమ్మని విశ్వనాథం ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

బ్రహ్మగర్జన మండల కోఆర్డినేటర్‌గా నాగార్జున శర్మ



సంగెం : తెలంగాణ బ్రహ్మగర్జన సేవా సంఘం చారిటబుల్ ట్రస్ట్ మండల కో కన్వీనర్‌గా అప్పె నాగార్జున శర్మను నియమిస్తు ఆ సంఘం జిల్లా కన్వీనర్ చెప్పెల శరత్‌బాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ హక్కులు, ఆత్మగౌరవం కోసం ఈ నెల 9వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన బ్రహ్మగర్జన కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో బ్రాహ్మణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చెక్కు పంపిణీ



గీసుకొండ : మండలంలోని మరియపురంలో ఉపాధి హామీ కింద మంజూరైన నిధులను పలువురు లబ్ధిదారులకు సర్పంచ్ అల్లం బాలిరెడ్డి శనివారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో చదివిన విదార్థిని భూక్యా మాయావతి ఐఐటీలో సీటు సాధించినట్లు సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఐఐటీ ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్పూర్ యూనివర్సిటీలో సీటు సాధించిందన్నారు. హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, వేణు, రాజుకుమార్, విష్ణు, అర్లయ్య ఉన్నారు.

భీమయ్యకు..

ఖానాపురం : మండలకేంద్రంలోని సొసైటీలో పనిచేస్తున్న భీమయ్య శనివారం పదవీ విరమణ పొందారు. దీంతో పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. రామస్వామి, ఆంజనేయులు, రాజు, వినయ్, డైరెక్టర్‌లు ఉన్నారు.

పరామర్శ

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణానికి చెందిన పసునూరి వెంకటమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. కాగా శనివారం వెంకటమ్మ మృతదేహాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు చీటూరి రాజు, ఐత రవికుమార్, పెద్దూరి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కోతి దాడిలో విద్యార్థికి గాయాలు

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థి ప్రణయ్ రోజు మాదిరిగానే పాఠశాలకు హాజరయ్యాడు. ఉదయం కోతులు వెంబడించడంతో కిందపడగా, కాళ్లు, చేతులపై దాడి చేశాయి. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

నర్సంపేట రూరల్: బిట్స్ కళాశాల వద్ద బారులుదీరిన అభ్యర్థులు



వర్ధన్నపేట: ఆలస్యం కావడంతో బయటే ఆగిన అభ్యర్థి



ఖానాపురం: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



ముగిసిన గ్రూప్-4 పరీక్ష

నర్సంపేట రూరల్ : టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–4 పోటీపరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. నర్సంపేట పట్టణం, మండలంలో మొత్తం 21పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏసీపీ సంపత్‌కుమార్, నర్సంపేట టౌన్, రూరల్ సీఐలు పులి రమేష్‌గౌడ్, సూర్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో సెంటర్‌లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు.నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో మొత్తం నాలుగు సెంటర్లు ఉండగా కలెక్టర్ ప్రావీణ్య, నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు, వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ కర్ణాకర్, డీసీపీ మురళీధర్ పర్యవేక్షించారు. సాయంత్రం బిట్స్ కళాశాల వద్ద వాహనాల రద్దీతో కిలోమీటర్ మేర గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. అదే విధంగా నర్సంపేట పట్టణంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు పరీక్ష ప్రశాంతంగా ముగిసిపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

నెక్కొండలో..

నెక్కొండ : మండలంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 360 మంది అభ్యర్థులకుగాను 262 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్షల కేంద్రం సీఎస్ ప్రణయ్‌కుమార్ తెలిపారు. 98 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై జానీపాష ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

తల్లి పరీక్షకు.. బిడ్డ అమ్మమ్మకు చెంతకు..

నెక్కొండ మండల కేంద్రంలో కేటాయించిన పరీక్ష కేంద్రానికి రాయపర్తి మండలం బంధనపల్లికి చెందిన గుగులోతు అరుణ–నెహ్రూ దంపతులు గ్రూప్–4 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. నెహ్రూ వరంగల్‌లోని ఓ కేంద్రంలో పరీక్షకు, అరుణ నెక్కొండలోని మోడల్ స్కూల్‌కు పరీక్ష రాయడానికి వెళ్లారు. కాగా, అరుణ తన బిడ్డను తల్లి బిచానికి ఇచ్చి పరీక్ష రాసింది. ఇద్దరు పరీక్షలకు హాజరు కావడంతో చిన్నారిని అమ్మమ్మ లాలించింది.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పోటీ పరీక్షలు వర్ధన్నపేట పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,992 మంది అభ్యర్థులు హాజరు కాగా ఇద్దరు అభ్యర్థులు రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో వారిని లోపలికి అనుమతించలేదు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించగా ఎస్సై దేవేందర్ పర్యవేక్షించారు. హైస్కూల్‌లో 312మంది అభ్యర్థులకు గాను 243మంది, మోడల్ స్కూల్‌లో 264మందికి 211మంది, సోషల్ వెల్ఫేర్‌లో 383మందికి గాను 303మంది హాజరయ్యారు.



నర్సంపేట రూరల్: అభ్యర్థులకు సూచనలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

ఖానాపురంలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని మోడల్‌స్కూల్‌లో జరిగిన గ్రూప్–4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మోడల్‌స్కూల్‌లో 432మంది అభ్యర్థులకు గాను 316మంది హాజరు కాగా 116 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎస్సై పిట్టల తిరుపతి ఆధ్వర్యంలో సిబ్బంది అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. అయితే సమయం ముగిసిన తర్వాత ఖమ్మం నుంచి ఒకరు, వరంగల్ నుంచి మహిళా అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండలకేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రంలో శనివారం గ్రూప్–4 పోటీపరీక్ష నిర్వహించారు. వర్ధన్నపేట సీఐ సదన్‌కుమార్, ఎస్సై బందారి రాజు, పోలీసులు పరీక్ష సెంటర్ వద్ద బందోబస్తు నిర్వహించారు.



రాయపర్తి: సోషల్ వెల్ఫేర్ పాఠశాల వద్ద..



నర్సంపేట రూరల్: శివాని హైస్కూల్ వద్ద..



నర్సంపేట రూరల్: వెనక్కి పంపిస్తున్న పోలీసులు



రాయపర్తి: బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



నెక్కొండ: హాల్‌ను తెలుసుకుంటున్న అభ్యర్థులు



నెక్కొండ: అభ్యర్థులను తనిఖీ పోలీసులు



వర్ధన్నపేట: ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న కానిస్టేబుల్



పర్వతగిరి: పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్సై



ఖానాపురం: ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతి నిరాకరిస్తున్న పోలీసులు



నెక్కొండ: తల్లి పరీక్ష రాయడానికి వెళ్లడంతో చిన్నారిని లాలిస్తున్న అమ్మమ్మ బిచాని

బీజేపీ పాలనతోనే దేశాభివృద్ధి



నర్సంపేట: మాట్లాడుతున్న బాల్నె జగన్



వర్ధన్నపేట: కరపత్రం అందజేస్తున్న నాయకులు

వర్ధన్నపేట : ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో బీజేపీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నల్లబెల్లి, రాంధన్‌తండా, ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాల్లో రాయపురం కుమారస్వామి ఆధ్వర్యంలో బీజేపీ పాలనలో చేసిన అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాయపురం కుమారస్వామి మాట్లాడుతూ.. బీజేపీ ద్వారా ప్రధాని తొమ్మిదేళ్లుగా రాష్ట్రానికి కేటాయించి అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికి చేరవేసే విధంగా కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందించడం జరిగిందన్నారు. కరోనా సమయంలో ఇటు దేశానికి, అటు ప్రపంచానికి చేసిన సేవలను గుర్తు చేయడం జరిగిందన్నారు. నాయకులు శ్రీనివాస్ నాయుడు, పంజా వెంకటేశ్వర్లు, సిద్ధం శ్రీనివాస్, కర్ర సోమిరెడ్డి, డోలి సతీష్, బూడిద రమేష్, సుధాకర్‌రావు, మైస రాజు, ఎలబోయిన రమేష్, నాగరాజు, సుధీర్, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అన్నారు. ఈ మేరకు 175, 179, 177ల బూత్ అధ్యక్షుడు మండ రాకేష్, సామల ప్రవీణ్, వేల్పుల విక్రమ్‌ల ఆధ్వర్యంలో శనివారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా 'మేరా బూత్.. సబ్ సే మజ్బూత్' పేరిట ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, కందికొండ శ్రీను, చింతం విజయరాణి, బూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

నర్సంపేట : వరంగల్‌లో జూలై 7వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద రాజుమాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమావేశం శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ ఒంగోలులో ఈదుముడి గ్రామంలో 1994 జూలై 7వ తేదీన 20మంది యువకులతో ఏర్పడ్డ ఎమ్మార్పీఎస్ నేడు దేశ వ్యాప్తంగా విస్తృతంగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా వరంగల్‌లో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించే మహాసభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సబ్బండ వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ పట్టణ అధ్యక్షుడు మునిగే యాకూబ్, నాయకులు బోయిని నారాయణ, మాదాసి బాబు, గుండేటి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద రాజు

ఉద్యమ గాయకుడికి ఘన నివాళి



చెన్నారావుపేట: నివాళులర్పిస్తున్న బాధ్యులు



సంగెం: లోహితలో సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు తదితరులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి మండల బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంది కృష్ణారెడ్డి, మహ్మద్ రఫీ, కుండె మల్లయ్య, జున్నూతుల రాంరెడ్డి, టేకుల స్వామి, కడగండ్ల యాకయ్య, కుసుమ నరేందర్, కందకట్ల సాంబయ్య, కందికొండ విజయ్‌కుమార్, బర్ల దేవదాసు తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

సంగెం : తెలంగాణ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ ఆత్మ శాంతించాలని కోరుతూ మండలంలోని లోహిత గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కళాకారుడు బొమ్మెర నగేష్, దొమ్మాటి సంపత్‌గౌడ్, ల్యాదళ్ల యాదగిరి, వార్డు సభ్యులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విలువైనవి



సంగెం: గవిచర్లలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ కనకదుర్గ ప్రతినిధులు



వర్ధన్నపేట: డాక్టర్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు



బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైద్యులు

- ఘనంగా డాక్టర్స్ డే
- వైద్యులను సన్మానించిన క్లబ్ బాధ్యులు

సంగెం : ఆపదలో ఉన్న వారికి, పేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గవిచర్లలో ప్రత్యేక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లయన్స్ క్లబ్ కనకదుర్గ వారు గవిచర్ల గ్రామాన్ని దత్తత తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ దొనికెల రమ, ఉప సర్పంచ్ యాకయ్య, లయన్స్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

ఆశాలపల్లిని దత్తత తీసుకున్న లయన్స్ క్లబ్

సంగెం మండలంలోని ఆశాలపల్లి గ్రామాన్ని లయన్స్ కృషి క్లబ్ హనుమకొండ బాధ్యులు దత్తత తీసుకున్నామని తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా శనివారం గ్రామంలో చిల్డ్రన్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యశిబిరం ఏర్పాటు చేసి 60మంది పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆట వస్తువులు అందజేసి, పాఠశాల ఎదుట మొక్కలు నాటారు. సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్, కాపులకనిపర్తి ఎంపీటీసీ బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ జయశ్రీ, ఆర్‌సీ పద్మజ, పాపారావు, మాడిశెట్టి రాజేందర్, కాసురేందర్, కుమారస్వామి ఉన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

వర్ధన్నపేట : డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ జయంతిని పురస్కరించుకుని డాక్టర్స్ డే వేడుకలు వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డాక్టర్ సోమశేఖర్ తదితర సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ వైద్యులకు, వైద్య రంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఎల్‌టీలు, ఫార్మసిస్టులు అన్ని విభాగాల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

డాక్టర్స్ డే సందర్భంగా వర్ధన్నపేట వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని డాక్టర్ భరత్‌ను క్లబ్ అధ్యక్షురాలు యాంసాని రాధిక శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అడ్డగూడి లావణ్య, కోశాధికారి పెనుమాటి హైమావతి, సభ్యులు బీరవెల్లి విజయలక్ష్మి, మాశెట్టి హైమావతి పాల్గొన్నారు.



చెన్నారావుపేట: వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

రాయపర్తిలో..

రాయపర్తి : డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తరుణి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సన్నూరు గ్రామంలో శనివారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. అనంతరం గ్రామంలో వైద్యసేవలందిస్తున్న వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు వజినపల్లి శైలజ, వైద్యాధికారులు ఎస్ కవిత, రీజినల్ చైర్ పర్సన్ శారద, నాగవాణి, తుమ్మూరు శ్రీదేవిరెడ్డి, సోమరజిని, వాణి, పద్మావతి, రజిని, స్వాతి, సర్పంచ్ నలమాస సారయ్య, ఎంపీటీసీ గోవింద్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జాతీయ డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వైద్యులు సరోజ, అనూష్, సహజలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌వీలు ప్రేమలత, సువార్త, స్టాఫ్ నర్స్‌లు స్వరూపారాణి, హేమలత, హెల్త్ అసిస్టెంట్లు శివాజీ, రామేల్, వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.



సంగెం: ఆశాలపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు



రాయపర్తి: సన్నూరులో..



విద్యార్థులకు అందించిన కరపత్రాలతో తరుణి సేవా సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలి

వర్ధన్నపేట : స్వచ్ఛ సర్వేక్షణ్–2023 ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ఎంపిక కావడంతో గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పూర్తి స్వచ్ఛతగా మార్చి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని కడారిగూడెం సర్పంచ్ మంద సతీష్ అన్నారు. శనివారం మహిళ సంఘాల సభ్యులతో కలిసి సర్పంచ్ సతీష్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంత, తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేసుకునేలా పలు సూచనలు చేశామన్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంధ్య, మహిళ సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, ఆయా ఎల్లమ్మ, వీఓఏ హైమ, ఎఎన్‌ఎంలు, అపరంజి, సరోజన తదితరులు పాల్గొన్నారు.